RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 01 సంచిక - 289 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్ మంగళవారం 25 జూన్ 2024

# సచివాలయంలో మంత్రి లోకేష్ బాధ్యతల స్వీకరణ.!

-విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభినందనలు.
-మెగా డిఎస్సీ విధివిధానాల ఫైలుపై లోకేష్ తొలి సంతకం.



**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:**
రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సచివాలయంలో సోమవారం నిరాడంబరంగా బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సచివాలయంలోకి అడుగుపెట్టిన లోకేష్.. 4వ బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నంబర్ - 208 చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. మెగా డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన ఫైలుపై లోకేష్ తొలిసంతకం చేసి, కేబినెట్ కు పంపారు. పలువురు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ నాయకులు లోకేష్ ను కలిసి అభినందనలతో ముంచెత్తారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, టీజీ భరత్, మాజీ ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ వేమూరి రవికుమార్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం, మాజీ ఎమ్మెల్సీలు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎస్ రామకృష్ణ, బుద్దా నాగ జగదీష్, అంగర రామ్మోహన్ రావు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా తదితరులు లోకేష్ ను కలిసి అభినందనలు తెలిపారు.

# జులై ఒకటో తేదీన ఇంటి వద్దకే పెన్షన్..!

**ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ తొలి సమావేశం ముగిసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో కేబినెట్ భేటీ జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ప్రధానంగా రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు సూపర్ సిక్స్ హామీల్లోని ఆరు గ్యారంటీలపై చర్చ జరిగింది. అనంతరం సీఎం చంద్రబాబు చేసిన తొలి ఐదు సంతకాలతో పాటు పలు కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన కీలక హామీల అమలుకు సంబంధించి సంతకాలు చేశారు. తొలి సంతకం మెగా డీఎస్సీపై, రెండో సంతకం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు, మూడో సంతకం సామాజిక పింఛన్ రూ.4వేలకు పెంపు ఫైల్‌పై చేశారు. అలాగే, స్కిల్ సెన్సస్ ప్రక్రియ చేపట్టడంతో పాటు అన్నా క్యాంటీన్ల ఏర్పాటుపైనా చంద్రబాబు సంతకాలు చేశారు. ఆ తర్వాత 16,347 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారు.



## కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అంశాలివే...

ప్రధానంగా సీఎం చంద్రబాబు చేసిన తొలి ఐదు సంతకాలకు అమలుకు రాష్ట్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మెగా డీఎస్సీ ద్వారా 16వేల 347 టీచర్ పోస్టుల భర్తీ చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఏప్రిల్ నుంచి పెంచిన రూ.4వేల పింఛను పంపిణీ, జులై 1 నుంచి ఇంటి వద్దే పింఛన్ల అందజేత, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది.
కాగా, మెగా డీఎస్సీ ప్రక్రియ జులై ఒకటి నుంచి ప్రారంభం కానుండగా... డిసెంబర్ 10వ తేదీలోపు 16,347 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గత ప్రభుత్వం ఇప్పటివరకు నెలకు రూ.3వేలు పింఛను పంపిణీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 65లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. కాగా, ఎన్నికల ప్రచారం వేళ చంద్రబాబు కీలక హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే పింఛనును ఒకేసారి రూ.4వేలకు పెంచుతామని ప్రకటించారు. అది కూడా ఏప్రిల్ నుంచి పెంచిన పింఛను అందిస్తామని తెలిపారు. అన్నట్లుగా కేబినెట్ మీటింగ్‌లో ఈ హామీకి ఆమోదం తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రూ.వెయ్యితో కలిపి.. 65 లక్షల మంది పింఛనుదారులకు వచ్చే నెలలో రూ.7వేల చొప్పున పింఛను అందనుంది. ఆ తర్వాత ఆగస్టు నుంచి రూ.4వేల పింఛను అందుకుంటారు.
అలాగే, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పేరును జగన్ ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ వర్సిటీగా మార్చింది. ఆ పేరును తిరిగి ఎన్టీఆర హెల్త్ వర్సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు పలు కీలక అంశాలపై చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గంలో చర్చించి ఆమోద ముద్ర వేసింది.

# పార్టీ కోసం కష్టపడ్డ వారికి త్వరలోనే నామినేటెడ్ పోస్టులు.!

-మొన్నటి ఎన్నికలను సవాల్ గా తీసుకుని కార్యకర్తలు, నేతలు పార్టీని విజయతీరానికి చేర్చారు.
-కార్యకర్తలు బలంగా ఉంటేనే...పార్టీ బలంగా ఉంటుంది...వారిని గౌరవిస్తాం.
-కార్యకర్తలను వేధించిన వారికి, అక్రమార్కులకు టీడీపీలోకి నో ఎంట్రీ.




2లో

# సూర్యనారాయణ దొరికితే చంపేయాలని సజ్జల

## ఏపీ ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణ ఆరోపణ.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
గత వైసీపీ ప్రభుత్వంలో తనకు ఎదురైన భయానక అనుభవాలను ఏపీ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల జేఏసీ ఛైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఇవాళ మీడియా ముందుకు వచ్చి వివరించారు.
ఏ కేసు పెట్టారో కూడా తెలియజేయకుండా విచారణ పేరిట తనను, తన కుటుంబాన్ని వేధించారని ఆరోపించారు. పోలీసులు తన భార్య మెడలోని నల్లపూసల గొలుసు తీసేయించి హేయంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తన ఇంటి చుట్టూ వందల సంఖ్యలో పోలీసులను మోహరించేవారని, హైదరాబాదులోని తమ చుట్టాల ఇంటికి వెళ్లి వాళ్లను కూడా బెంబేలెత్తించేవాళ్లని వివరించారు.
రాత్రి సమయాల్లో కూడా పోలీసులు తన ఇంటి చుట్టూనే ఉండేవారని... తన కుటుంబాన్ని వేధించిన పోలీస్ ఆఫీసర్లు రావి సురేశ్ రెడ్డి, భాస్కరరావులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.
అంతేకాకుండా, ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును కలిస్తే ఆ దేవుడు కూడా నిన్ను కాపాడలేడు అంటూ తనకు బెదిరింపులు వచ్చాయని సూర్యనారాయణ ఆరోపించారు.



తన ఫోన్ ను కూడా ట్యాప్ చేశారని, పోలీసులు తన వాహన డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని చిత్రహింసలు పెట్టారని వెల్లడించారు.
సూర్యనారాయణ దొరికితే చంపేయాలని సజ్జల పోలీసులకు ఆదేశాలు జారీ చేశారని, "సూర్యనారాయణ దొరికాడా?" అంటూ సజ్జల పోలీసులకు ఫోన్ చేయడం తన డ్రైవర్ విన్నాడని సూర్యనారాయణ స్పష్టం చేశారు. అందుకే, జ్యుడిషియల్ ప్రివ్యూ కమిషన్ ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. తనలాగా గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడిన వారికి న్యాయం చేయాలని సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏపీ క్యాబినెట్ తొలి సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ ని కలిసిన తెలుగు సినీ నిర్మాతలు.!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులను సినీ పరిశ్రమ తరఫున అభినందించడానికి అపాయింట్మెంట్ అడిగినట్టు, తమ విజ్ఞాపనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించినట్టు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తెలియచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడతానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారన్నారు.
తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చించలేదనీ, త్వరలోనే మరోసారి కలిసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగ విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో తెలుగు సినీ నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫి శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ గారు, నిర్మాతలు శ్రీ సి.అశ్వనీదత్, శ్రీ ఎ.ఎం.రత్నం, శ్రీ డి.సురేష్ బాబు, శ్రీ ఎస్.రాధాకృష్ణ (చినబాబు), శ్రీ దిల్ రాజు, శ్రీ భోగవల్లి ప్రసాద్, శ్రీ డి.వి.వి.దానయ్య , శ్రీమతి సుప్రియ, శ్రీ ఎన్.వి.ప్రసాద్, శ్రీ బన్నీ వాసు, శ్రీ నవీన్ ఎర్నేని, శ్రీ నాగవంశీ, శ్రీ టి.జి.విశ్వప్రసాద్, శ్రీ వంశీ కృష్ణ, శ్రీ వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు సహకరించండి

-గత ప్రభుత్వంలో మాదిరి అనవసర వేధింపులు ఉండవు.
-విద్యాశాఖ మంత్రి నారా లోకేష్




ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కు సోమవారం అభినందనలు వెల్లువెత్తాయి. ఉదయం బాధ్యతలు స్వీకరించిన వెంటనే లోకేష్... ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం నుంచి ఛాంబర్ లో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను లోకేష్ ను కలిశారు. మంత్రిని పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి యువనేతకు అభినందనలు తెలిపారు. విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత అయిదేళ్లుగా గత ప్రభుత్వ అనాలోచిత విధానాల కారణంగా విద్యాప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, మళ్లీ విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు ఉపాధ్యాయులంతా సహకరించాలని కోరారు. గతంలో మాదిరి ఉపాధ్యాయులపై అనవసరమైన పనిభారం, వేధింపులు ఉండవని తెలిపారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు.

# వేలకోట్ల విలువైన భూములను జగన్ కొట్టేశాడు.

- దేవినేని ఉమామహేశ్వరరావు.



2లో

# ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై విచారణ చేపట్టాలి.

**-విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
నంద్యాల జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజులు దోపిడీని అరికట్టడంలో వైఫల్యం చెందిన విద్యాశాఖ అధికారులు.నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు కి ఫిర్యాదు చేసిన ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్, కోశాధికారి సురేష్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ తమకు ఇష్టం వచ్చినట్టుగా ఫీజులను నిర్ణయించుకొని విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తూ, విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి పాఠశాలలను వ్యాపార సంస్థలు గా మార్చుకొని పాఠశాల ఆవరణంలోనే స్కూల్ బుక్స్,షూ, టై బెల్టు, యూనిఫాములను అమ్ముతున్నారని వారు తెలిపారు.ఇంకా కొన్ని పాఠశాలలను రేకుల షెడ్లలో నిర్వహిస్తూ, సక్రమమైన తరగతి గదులు లేకుండా పాఠశాల నడుపుతూ, కనీస సౌకర్యాలు లేకుండా పాఠశాల నిర్వహణ చేస్తూ, విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని వారన్నారు.ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు విచ్చలవిడిగా విద్యా వ్యాపారం చేస్తూ తమకు ఇష్టం వచ్చినట్టుగా ఫీజులు దోపిడీ చేస్తున్నప్పటికీ వారిని అరికట్టడంలో జిల్లా విద్యాశాఖ అధికారులు వైఫల్యం చెందారని వారు తెలిపారు. అటువంటి పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వంలో మొట్టమొదటిసారిగా నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో జరిగినటువంటి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్ లు తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించే విచ్చాలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.

# పార్లమెంట్ లో అడుగు పెట్టిన

## నంద్యాల తొలి మహిళా ఎంపి డా. బైరెడ్డి శబరి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
72 సంవత్సరాల నంద్యాల లోక్ సభ చరిత్రలో 39 ఏళ్ల వయస్సు లోనే డా. బైరెడ్డి శబరి నంద్యాల లోక్ సభకు తొలి మహిళా ఎంపి గా ఎంపికై చరిత్ర సృష్టించారు. సోమవారం న్యూ ఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవనంలో 18 వ లోక్ సభకు ఎన్నికైన ఎంపీలు లతో ప్రొటెం స్పీకర్ భర్తృ హరి ప్రమాణ స్వీకారం చేయించారు. నంద్యాల లోక్ సభ నుంచి ఎన్నికైన డా. బైరెడ్డి శబరి ఆ ఈశ్వరుడు సాక్షిగా తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. దేశ చిత్రపటంలో నంద్యాల లోక్ సభ కు ప్రత్యేక గుర్తింపు ఉంది.భారత రాజ్యాంగంలోనే కీలక పదవులైన రాష్ట్రపతి, ప్రధానమంత్రి పదవులు చేపట్టి దేశానికి సేవ చేసిన నంద్యాల లోక్ సభ సభ్యులు నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావులు.
ఐదు సార్లు నంద్యాల లోక్ సభకు ఎంపికై కేంద్రమంత్రిగా, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలకు గవర్నర్ గా, ఎన్నో ఉన్నత పదవులు చేపట్టి సిల్వర్ జూబ్లీ పార్లమెంటరియన్ గా గుర్తింపు పొందిన పెండెకంటి వెంకటసుబ్బయ్య నంద్యాల ఎంపీగా దేశానికి సేవలందించారు.



### బైరెడ్డి శబరి సేవా కార్యక్రమాలు, కుటుంబ రాజకీయ నేపథ్యం

కర్నూలు, శ్రీశైలం, పాణ్యం, నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని చెంచు, దళిత కాలనీలలో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిరుపేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందించి, ఉచితంగా మందులు అందిస్తున్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ఉద్యమం చేస్తూ నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షురాలుగా పనిచేసారు. ఇటీవల బీజేపీ కి రాజీనామా చేసి మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో డా. బైరెడ్డి శబరి, ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి లు తెలుగుదేశం పార్టీలో చేరారు.డా. బైరెడ్డి శబరి సేవా కార్యక్రమాలు, ఆమె రాజకీయ కుటుంబ నేపధ్యాన్ని గుర్తించి టీడీపీ అధినేత చంద్రబాబు నంద్యాల టీడీపీ పార్లమెంట్ అభ్యర్థిగా ఎంపిక చేయగా తన ప్రత్యర్థి ఎంపి, వైసీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిపై లక్ష ఓట్లకు పైగా శబరి ఎంపి గా విజయం సాధించారు. టీడీపీ పార్లమెంటరీ పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించిన టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డా. బైరెడ్డి శబరిని టీడీపీ లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గా ఎంపిక చేసి నంద్యాల ఎంపి పదవికి ప్రత్యేక స్థానం లోక్ సభలో ఉందని గుర్తు చేశారు.
ఢిల్లీలోని పార్లమెంట్ భవనం లో జరిగే లోక్ సభ సభ్యుల పదవీ ప్రమాణ స్వీకారానికి నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి వెళ్లి ప్రమాణం చేయడాన్ని శబరి భర్త డా. శివచరణ్ రెడ్డి, తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తల్లి బైరెడ్డి భారతమ్మ , చిన్నాన బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, చెల్లెలు బైరెడ్డి శర్వాని లు కనులారా తిలకించి ఆనందిస్తూ అభినందించారు.

# సైకిల్ అవార్డ్ గ్రహీతలకు అభినందనలు.

**-నంద్యాల టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
తెలుగుదేశం పార్టీ అఫిషియల్ యాప్ మనటీడీపి యాప్ ను వినియోగించి విస్తృతంగా టీడీపీ పార్టీ కార్యక్రమాలను మరియు అప్పటి వైసిపి ప్రభుత్వం సాగించిన అరాచకాలను యాప్ ద్వారా ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాలలో చురుకుగా పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించినందుకు గాను టీడీపీ పార్టీ తరుపున జాతీయ కార్యదర్శి మంత్రి నారా లోకేష్ పంపిన బహుమతిని డెస్క్ టాప్ టేబుల్ సైకిల్ ను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు సీనియర్ న్యాయవాది వెదుళ్ళ రామచంద్ర రావు చేతులమీదుగా అందుకున్న నంద్యాల 41 వ వార్డ్ టీడీపీ నాయకులు సూలం శ్రీనివాసులు (బుజ్జి). ఈ కార్యక్రమంలో రామచంద్ర రావు మాట్లాడుతూ.. తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు కార్యకర్తల వెంట నిలబడి వారి అభ్యున్నతి కోసం, చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ కార్యకర్తలను విస్మరించకుండా, వారికి అండగా నిలబడే ఏకైక ప్రభుత్వం ఒక తెలుగుదేశం పార్టీ మాత్రమే అని కొనియాడారు.నంద్యాల రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మరియు రీజినల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు దండే దస్తగిరి, 41 వ వార్డు ఇన్చార్జి శూలం వెంకటేశ్వర్లు (చింటూ),గోరంట్ల హరినాథ్ ,గోరంట్ల రామకృష్ణ ,బోయ రామకృష్ణ, అబ్దుల్లా ,సంఘ శ్రీకాంత్ కొప్పుల, సుబ్బారెడ్డి జనసేన రవికుమార్ మరియు ఉమ్మడి జిల్లా బలిజ సంఘం అధ్యక్షులు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# పార్టీ కోసం కష్టపడ్డ వారికి త్వరలోనే నామినేటెడ్ పోస్టులు.!

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
సార్వత్రిక ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడి కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికలను ప్రతి ఒక్కరూ సవాల్ గా తీసుకుని పోరాడటం వల్లే ఘన విజయం సాధ్యమైందన్నారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొని పోరాడిన వారికి తప్పకుండా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందని హామీ ఇచ్చారు...కష్టపడ్డ వారి వివరాలను సేకరిస్తున్నామని అన్నారు. పార్టీ నేతలు ఇచ్చే రిపోర్టులతో పాటు...ఇతర మార్గాల్లో కూడా రిపోర్టులు తెప్పించుకుని కష్టపడిన వారికే పదవులు వచ్చేలా చేస్తామని అన్నారు. పార్టీ కోసం శ్రమించిన వారిని ఆదుకుంటేనే పార్టీ కూడా బలంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యేలు, ఇంఛార్జ్ లు, పార్లమెంట్ అధ్యక్షులతో చంద్రబాబు సోమవారం టెలీకాన్ఫ రెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...."ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్ల పాటు బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, యువగళం,రా...కదలిరా, ప్రజాగళం వంటి వివిధ కార్యక్రమాలతో ప్రజలతోనే ఉన్నాం. సాగునీటి ప్రాజెక్టులను కూడా సందర్శించి గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాం. గత ఐదేళ్ల పాటు కార్యకర్తలు, నాయకులపై వైసీపీ ప్రభుత్వం ఎన్నో అక్రమ కేసులు పెట్టింది. వీటన్నింటిని తట్టుకుని నిలబడ్డారు. ఎన్నికల్లో మూడు పార్టీల నేతలు, కార్యకర్తలు కలిసి పని చేయడం వల్ల 57 శాతం ఓట్లు సాధించి, 93 శాతం స్ట్రైక్ రేట్ తో గెలిచాం" అని సీఎం చంద్రబాబు అన్నారు. "అధికారాన్ని అడ్డం పెట్టుకుని పార్టీకి, కార్యకర్తలకు నష్టం చేసి, వేధించిన వైసీపీ నేతలకు తెలుగుదేశం పార్టీలోకి ఎంట్రీ లేదు. పార్టీకి అన్యాయం చేసిన వారిని ఉపేక్షించేది లేదు.




అధికారం వచ్చిందని స్వలాభం కోసం వచ్చే వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రజలు నమ్మకం పెట్టుకుని కూటమిని గెలిపించారు..వారి నమ్మకాన్ని నిలబెడదాం. పొత్తులో భాగంగా 31 మంది పార్టీ ఇంఛార్జ్ లకు సీట్లు రాలేదు...అయినా వెనకడుగు వేయకుండా కూటమి గెలుపే లక్ష్యంగా పని చేశారు. అందువల్లే చరిత్రలో లేని విధంగా ఫలితాలు వచ్చాయి. నేను కూడా ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్లి కార్యకర్తలు, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్నా. రైట్ మ్యాన్...రైట్ పొజిషన్ అనే విధంగా భవిష్యత్తులో నిర్ణయాలు ఉంటాయి. 2029 ఎన్నికల్లో విజయానికి కూడా ఇప్పటి నుండే ప్రణాళిక ఉండాలి." అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. "ప్రజలకు మంచి చేస్తే మనకు అనుకూల ఫలితాలే వస్తాయి. ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చుతున్నాం. మెగా డీఎస్సీకి కేబినెట్ కూడా ఆమోదం తెలిపింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను గత ప్రభుత్వం స్వార్థం కోసం ప్రవేశపెట్టింది. దాని రద్దుకు కూడా నిర్ణయం తీసుకున్నాం. పెన్షన్లు రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచాం. మూడు నెలల బకాయిలు వెయ్యి చొప్పున కలిపి వచ్చే నెలలో రూ.7 వేలు ఇవ్వబోతున్నాం. బకాయిలతో కలిపి రూ.7 వేలు ఇవ్వడం దేశ చరిత్రలో ఎప్పుడూ లేదు. వికలాంగులకు రూ.3 వేల నుండి రూ.6 వేలకు పెంచాం. వచ్చే నెల పెన్షన్ల పంపిణీ సచివాలయ సిబ్బందితో ఉంటుంది. గత ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో పెన్షన్లు ఇవ్వడం అసాధ్యం అని చెప్పింది...సాధ్యం అవుతుందని చెప్పడానికే సచివాలయ సిబ్బందితో పెన్షన్ల పంపిణీ చేపట్టబోతున్నాం. రాష్ట్రంలో ఒక పండుగ వాతావరణం రాబోతోంది. ప్రజల సాధికారత కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుంది. ఇచ్చిన మాట ప్రకారం ఫేజ్ -1 లో 183 అన్న క్యాంటీన్లను రాష్ట్రంలో పున:ప్రారంభించబోతున్నాం. ప్రజల భాగస్వామ్యంతో అన్న క్యాంటీన్ల నిర్వహణ ఉంటుంది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాడు చేసిన 5 సంతకాలకు కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపాం." అని సీఎం చంద్రబాబు వివరించారు.
"పల్లా శ్రీనివాసరావు గాజువాకలో రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచారు. రాష్ట్ర చరిత్రలో ఇంత మెజారిటీ ఎప్పుడూ రాలేదు. బీసీ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావును టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించాం. గతంలోనూ బీసీలకే పార్టీ అధ్యక్ష పదవి ఇచ్చాం...ఈ దఫా కూడా బీసీలకే ఇచ్చాం. వెనకబడిన వర్గాలకు టీడీపీ ప్రాధాన్యం ఇచ్చింది...ఇస్తుంది కూడా. స్పీకర్ పదవి కూడా బీసీ వర్గానికి చెందిన అయ్యన్న పాత్రుడుకు ఇచ్చాం.క్యాబినెట్ కూర్పులో కూడా సామాజిక సమతూకం పాటించాం" అని సీఎం చంద్రబాబు అన్నారు.

# వేలకోట్ల విలువైన భూములను జగన్ కొట్టేశాడు.

**- దేవినేని ఉమామహేశ్వరరావు.**

**-ప్రజాప్రయోజన కార్యక్రమాలకు కేటాయించిన భూముల మళ్లింపు.**

**-ఐదేళ్ల పాలనలో భూ పందేరం చేశాడని ఫైర్.**

**-అక్రమ రాజభవనాల నిర్మాణం వెనక క్విడ్ ప్రో కో.**



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
ఐదేళ్ల పాలనలో జగన్ ఆంధ్రప్రదేశ్ లోని విలువైన భూములను కొట్టేశాడని, వేల కోట్ల విలువైన భూములను కాజేశాడని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమ ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రాష్ట్రాన్ని దోచేశాడని మండిపడ్డారు. ఖరీదైన ప్రాంతాలలో వైసీపీ కార్యాలయాలకు, అస్మదీయులకు భూములు కేటాయించారని విమర్శించారు. చివరకు ప్రజాప్రయోజన కార్యక్రమాల కోసం కేటాయించిన భూములనూ వదల్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ స్థలాల్లో భారీ రాజభవనాల నిర్మాణం వెనక క్విడ్ ప్రో కో జరిగిందని ఆరోపించారు. ఈ కేటాయింపులు కానీ, నిర్మాణాలకు సంబంధించిన వివరాలు కానీ రికార్డుల్లో ఎక్కడా కనిపించవని చెప్పారు. లెక్కల్లో చూపకుండా అందినకాడికి దండుకున్నారని మండిపడ్డారు. ఐదేళ్లలో జగన్ చేసిన ఈ భూ పందేరంపై సమగ్ర విచారణ జరిపి, చర్యలు తీసుకుని రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వానికి దేవినేని ఉమ విజ్ఞప్తి చేశారు.

# గనుల, ఎక్సైజ్ శాఖలు పూర్తి స్థాయిలో ప్రక్షాళన.

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 24:
కూటమి ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో స్వచ్ఛమైన పరిపాలన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజలకు అందించాలని సంకల్పించారని, అత్యంత కీలకమైన గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖలు నాకు కేటాయించడం ఒక గురుతర బాధ్యతగా భావిస్తూ, సమర్థవంతంగా పని చేసి, వాటి ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చడానికి నా శాయశక్తులా కృషి చేస్తానని మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర అన్నారు. వెలగపూడి సచివాలయం మూడవ భవనం మొదటి అంతస్థులో కుటుంబ సభ్యులతో కలిసి వేద పండితుల మంత్రోచ్ఛారణలు, పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి కొల్లు



రవీంద్ర మైన్స్, ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గత 2022 వ సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉన్న ఓఎన్ జిసి ఎక్స్ప్లోరెషన్ లైసెన్స్ రీ గ్రాంట్ ఫైల్ పై మంత్రి తొలి సంతకం చేశారు. పెట్రోలియం, నేచురల్ గ్యాస్ నిబంధనలు 1959 ప్రకారం షరతుల మేరకు 2022 నుంచి 2040 వరకు ఈ లైసెన్స్ పునరుద్ధరణ జరుగుతుంది. రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానానికి రూపకల్పన చేసి, మద్యం లావాదేవీలు, డిస్టిలరీల నుంచి పంపిణీ అత్యంత పారదర్శకంగా అమలు జరిపేందుకు, అక్రమ ఇసుక రవాణాను నియంత్రించి, ప్రజావసరాల కనుగుణంగా ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.
మన రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన ఖనిజ సంపద వనరులు ప్రజా శ్రేయస్సు కోసం సద్వినియోగం చేస్తామని, ఈ సందర్భంగా మచిలీపట్నం నియోజకవర్గ ప్రజానీకానికి, రాష్ట్ర ప్రజలకు శిరసాభివందనం చేస్తున్నానని మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర తెలియ జేశారు.
మైన్స్ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్, డైరక్టర్ మైన్స్ శ్రీ ప్రవీణ్ కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాద పూరవకంగా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 25 జూన్ 2024

# సమస్యల వేగవంత పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించండి

## జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 24:
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పద్మజ అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత మళ్లీ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం




చుట్టిందని... ఈ మేరకు అధికారులందరూ సీరియస్ గా తీసుకొని గత స్పందన లాగిన్ ఐడీలతోనే ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఆన్లైన్ సిస్టంలో కూడా లాగిన్ అయ్యి ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేసే అవకాశం కూడా వుందని, ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకొని పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ లోని దరఖాస్తులు వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

### ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు

1) నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ కు చెందిన రభియా తాను గత ఫిబ్రవరి నెలలో రోడ్డు ఆక్రమణకు సంబంధించి సచివాలయం, మున్సిపల్ ఆఫీసులో కంప్లైంట్ ఇచ్చినా పరిష్కారం కాలేదని నాపై దయ వుంచి స్థల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
2) అవుకు మండలం చెన్నంపల్లే గ్రామ కాపురస్థురాలు పుల్లమ్మ తనకు 1.56 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నదని... పీఎం కిసాన్ రైతు భరోసా పథకం డబ్బులు పడటం లేదని నాకు ఆ డబ్బులు పడేలా చేయమని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.
3) ఆత్మకూరు మండలానికి చెందిన ఫిరోజ్ బాషాకు సర్వే నంబర్ 35/%రా% లో 5.08 ఎకరాల పొలానికి సంబంధించి డీ - నమూనా పట్టా పొందాను, కానీ ఆన్లైన్ లో ఈ- పాస్ పుస్తకం రాలేదని ఆన్లైన్ చేపించి ఈ పాసుపుస్తకం ఇప్పించగలరని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో 79 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# ఫిర్యాదులుపై విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం.

### -జిల్లా ఎస్పీ. కె.రఘువీర్ రెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:**
నంద్యాల జిల్లా బొమ్మల సత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ఫిర్యాదిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండీ విచ్చేసిన ఫిర్యాదిదారుల సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడి చట్టపరిధిలో ఫిర్యాదిదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం గా వ్యవహరించరాదని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రవీంద్ర,ఎస్పీ సీసీ నాగరాజు పాల్గొన్నారు.

# ధోబీ ఘాట్ ప్రదేశాన్ని సందర్శించిన ఎన్ఎండి ఫిరోజ్.





ఆంధ్రప్రదేశ్ నంద్యాల జూన్ 24:
నంద్యాల పట్టణంలోని గోపాల్ నగర్ 15 వ వార్డు నందు రజక సోదరుల కోసం నిర్మించబోయే "ధోబీ ఘాట్" ప్రదేశాన్ని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అభిర్భావం నుండి బీసీ సోదరులకు అండాదండగా నిలిచిందని బీసీ సమాజన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి టీడీపీ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఎన్నికల ప్రచారంలో రజక సోదరులకు దోబీ ఘాట్ నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని దాన్ని నెరవేర్చే దిశగా ఈరోజు ధోబి గాట్ ప్రదేశాన్ని సందర్శించడం జరిగిందన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన రజక సోదరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందని ఏ సమస్య వచ్చినా మీ ముందు నేను ఉంటానని సమస్యను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది . గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో బీసీలకు గాని ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు గాని వారు చేసింది ఏమీ లేదని మాటలకే పరిమితమయ్యారన్నారు . నంద్యాల నా బాధ్యత అనే వ్యక్తి ప్రజల్ని విస్మరించి ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో విఫలం అయ్యాడు అన్నారు. కానీ తెలుగుదేశం పార్టీ అలా కాదని తెలుగుదేశం పార్టీ అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని పోయి వారి అవసరాలను తీరుస్తూ వారి వెంట ఉండే పార్టీ అన్నారు. తెలుగుదేశం పార్టీ మీకు ఎప్పటికీ అండగా ఉంటుందని మీరేం భయపడాల్సిన అవసరం లేదని ఖచ్చితంగా మేము ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏ.వి.ఆర్ ప్రసాద్ మరియు టిడిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మన్నించు.. నందీశ్వరా..!

### -అడవిని తలపిస్తున్న నంది పరిసరాలు. -ఆలయ అధికారుల పర్యావేక్షణ శూన్యం.

### మాకు నీ ఆదాయమే కావాలి.. నీ బాగోగులు మాకు అవసరం లేదు.?

**ఆంధ్ర ప్రగతి మహానంది జూన్ 24:**
మహానంది పుణ్యక్షేత్రానికి రోజుకు ఎంతోమంది భక్తులు వచ్చి శివయ్యను దర్శించుకుంటారు. దర్శనం అనంతరం గుర్తుకు వచ్చేది భక్తులకు పుణ్యక్షేత్రం పరిసరాలలో ఉన్నటువంటి పెద్ద నంది, వెంటనే భక్తాదులు నంది ఆవరణలోకి టికెట్టును సైతం లెక్కచేయకుండా 10 రూ వెచ్చించి మరి లోపలికి వెళతారు, అయితే లోపలికి వెళ్ళగానే అడవిని తలపించేటట్లుగా నంది చుట్టూ వున్న పరిసరాలను చూసి భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ ఏ పురుగు



పుట్ట ఉందో కూడా తెలియదు, ప్రస్తుతం చిరుత పులి సంచరిస్తుందని పలుమార్లు చెప్పినా అధికారుల నిర్లక్ష్య వైఖరి మాత్రం మారటం లేదు. ఈ నంది పరిసరాలలో గతంలో టెండర్ల ద్వారా లక్షల లక్షలకు పైగా ఆదాయం పొందియున్నారు. ప్రస్తుతం 10 రూ భక్తుల దగ్గర వసూలు చేసుకుంటూ కనీస వసతులు కూడా చూడటం లేదని భక్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నంది పరిసరాలను శుభ్రం చేసి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.


# మున్సిపల్ చైర్మన్ పై టీడీపీ వర్గీయుల దౌర్జన్యం అప్రజాస్వామికం.

### -ఎమ్మెల్సీ ఇసాక్ బాష

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళ నంద్యాల మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసాపై శనివారం పట్టణంలోని 29వ వార్డు సచివాలయంలో టీడీపీ వర్గీయులు చేసిన దౌర్జన్యం, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా నంద్యాలలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పందించి మైనార్టీ మహిళకు తగిన న్యాయం చేయాలని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష, బాధిత మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా కోరారు. సోమవారం సాయంత్రం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ చైర్పర్సన్ స్వగృహంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, వైఎస్సార్సీవ్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వార్డు ఇంచార్జ్లు కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘటన వివరాలను వెల్లడించారు. నంద్యాలలో ప్రశాంత వాతారణానికి రాజకీయనాయకులు సహకరిస్తున్నారని, కానీ నేడు కొత్త సంస్కృతిని తీసుకురావం మంచి పద్దతి కాదని వెంటనే



మంత్రి ఫరూక్ చొరవ తీసుకోవాలని మైనార్టీ మహిళలకు న్యాయం చేయాలని కోరారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయడం సాంప్రదాయంగా వస్తున్నదని, ఈ వ్యవహారం అంతా సమాచార శాఖ వారు లేదా సంబంధిత కార్యాలయ అధికారులు చూస్తారని తెలిపారు. అయితే శనివారం 29వ వార్డు సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలతో టీడీపీ వర్గీయులు వచ్చి అక్కడే ఉన్న మున్సిపల్ చైర్పర్సన్తో ఫోటోలు ఏర్పాటుపై ఘర్షణ పడడం సమంజసం కాదని ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముస్లిం మైనార్టీ మహిళను ఏకవచనంతో దుర్భాషలాడటం సరికాదని, చర్యలు అప్రజాస్వామికమన్నారు. మహిళపై చెయ్యి ఎత్తి కొట్టేందుకు ప్రయత్నించడం మంచిపద్దతికాదన్నారు. రాజకీయంలో గెలుపు ఓటములు సహజమేనని, ఇలాంటి చర్యలు చేయరాదన్నారు. ప్రస్తుత న్యాయశాఖ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ గతంలో అనేక సార్లు మంత్రిగా వివిధ శాఖల్లో పనిచేశారని, నంద్యాలలో ముస్లిం మహిళపై టీడీపీ వర్గీయులు దౌర్జన్యం చేసి దుర్భాషలాడి అవమానపరచడం జరిగిందని, ఇటువంటి చర్యలు పునరావృతం



కాకుండా చూడాలని, మహిళకు న్యాయం చేయాలని, నంద్యాల ప్రశాంతతకు బంగం కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బాడుగ ఇంటిలో నివసిస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ను ఇంటిని ఖాళీచేయిస్తానని, రోడ్డుపై నిలబెడతానని దౌర్జన్యం చేయడం సబబుకాదన్నారు. మహిళపై దుర్భాషలాడిన వారు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పెట్టడం అన్యాయం అన్నారు. భవిషత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కారాదని, లేని పక్ష్యంలో సహించేదిలేదన్నారు. అలాగే శిలాఫలకాలు ద్వంసం చేయడం ప్రజాస్వామ్యంలో మంచి సంస్కృతి కాదన్నారు. నంద్యాలలో ప్రశాంత వాతావరణానికి మంత్రి ఫరూక్ తగిన చొరవతీసుకోవాలని మైనార్టీ మహిళకు న్యాయం చేయాలన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.... శనివారం స్థానిక 29వ వార్డులో తనపై జరిగిన దౌర్జన్యకర సంఘటన తనను ఎంతో అవమానకరంగా దుర్భాషలాడిన వారు తనపై ఎస్టీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం సరికాదన్నారు. ముస్లిం మైనార్టీ మహిళ మున్సిపల్ చైర్పర్సన్ అయిన తనను ఏకవచనంతో మహిళనని చూడకుండా చీరేస్తా, ఏయ్..ఏమి పీక్కుంటావో పీక్కోపో... ఇది అతిచేస్తోంది...మాటల్లో చెప్పలేని విధంగా తనను అవమాన పరిచారని వాపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రోటోకాల్ పాటించే విషయం తనకు తెలుసని సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలను తానే సంబంధిత అధికారలచే ఏర్పాటు చేస్తానని చెప్పినా తనపై ఇలా దౌర్జన్యం చేశారని, న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి నంద్యాల్లో జరుగుతున్న దాడులపై స్పందించి తగిన న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, లేని పక్ష్యంలో రాబోయే రోజుల్లో మైనార్టీ మహిళలకు బయటికి రావడాలని భయపడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# డెంగ్యూ, మలేరియా వ్యాధి నియంత్రణలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోండి.

**-డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోండి. -వైద్యాధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 24:
దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా తదితర వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు వైద్యాధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కీటక జనత వ్యాధులైన మలేరియా డెంగ్యూ కేసుల నేను తనపై నియంత్రణపై జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై అన్ని శాఖలు సమన్వయం చేసుకొని ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కాలువలలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రపరిచి దోమల లార్వా నాశన మందులను పిచికారి చేయాలన్నారు. నీరు నిలువ ఉన్న ప్రదేశాలను గుర్తించి మట్టితో కప్పాలన్నారు. ఫ్రైడే డ్రై డే ఆక్టివిటీని వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్ లో గుర్తించిన దోమ బ్రీడింగ్ ప్లేసెస్ తొలగించుటలో మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులు వైద్య శాఖతో సమన్వయం చేసుకొని వ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులచే పిల్లలకు కీటక జనత వ్యాధుల గురించి అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలకు వచ్చే గర్భవతులు, బాలింతలకు ఫ్రైడే డ్రైడే మరియు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. మైనింగ్ గనులలో నీరు నిల్వ ఉన్న గుంతలలో దోమల నివారణ మందులు పిచికారి చేయించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖలు వైద్య ఆరోగ్యశాఖతో సమన్వయం చేసుకొని కీటక జనిత వ్యాధులను రాకుండా పగడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలలో మండల అభివృద్ధి అధికారులు, వైద్య, పారిశుధ్య సిబ్బంది సమన్వయంతో తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ం

**డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోండి.**

జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు డయేరియా నియంత్రణపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కే శ్రీనివాసులు వైద్య అధికారులు ఆదేశించారు. బేతంచెర్ల, డోన్, మిడుతూరు, కొత్తపల్లి, నంద్యాల ప్రాంతాలలో ఎక్కువగా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో సీరియస్ గా తీసుకొని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.
పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ అధికారులు తాగునీరు కలుషితం కాకుండా యుద్ధ




ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. పైప్ లైన్ లీకేజీలు కాకుండా మరమ్మతులు చేయడంతో పాటు తాగునీటి వనరులలో నీటి కాలుష్యం నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, వ్యర్థాల సంక్రమణ నిర్వహణ, సురక్షిత తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో బరువు తక్కువ ఉన్న పిల్లలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్ ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములను చేసి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యువజన సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి కూలీలు మేట్లతో సమావేశం నిర్వహించి డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, డిపిఓ మంజులవాని, డీఈవో సుధాకర్ రెడ్డి, డిఆర్డిఏ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, అన్ని సంక్షేమ హాస్టళ్ల అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాయి యువసేన సర్వీస్ 3 వ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
నంద్యాల పట్టంలోని శ్రీ రామకృష్ణ కళాశాల ఆవరణంలో ఉన్న వివేకానంద ఆడిటోరియంలో ఘనంగా సాయి యువసేన సర్వీస్ 3 వ వార్షికోత్సవం అధ్యక్షులు రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, ఈ కార్యక్రమం ముఖ్య అతిథులుగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, రామకృష్ణారెడ్డి విద్య సంస్థ అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి , టిడిపి కార్యదర్శి తులసి రెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ సాయి యువసేన సర్వీస్ సభ్యులు చేస్తున్న సేవలు చాలా మంచివని అలాగే ఫంక్షన్లలో మిగిలిన ఆహార పదార్థాలను రైల్వే స్టేషన్లో మరియు బస్టాండ్లో వున్న అనాధలకు పంచడం. రక్తదాన కార్యక్రమాలు సంస్థ ద్వారా చేయడం . నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ




చేయడం . నిరుపేద కుటుంబాలకు వస్త్రాలు పంపిణీ చేయడం . రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారినిఅత్యవసర చికిత్స చేపించడం. మానసిక వికలాంగులకు సహాయం చేయడం లాంటి సేవ కార్యక్రమాలను చేస్తూ మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని అభినందించడం జరిగిందన్నారు. అనంతరం 15 మంది నిరుపేద



కుటుంబాలకు కిరాణా సరుకులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తాపీ పనివార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మదర్సా , ఏఎస్ఐ మాసం సహాయబ్ , రోటరీ క్లబ్ సెక్రెటరీ సుధా ప్రసాద్ రెడ్డి , రోటరీ క్లబ్ ట్రెజరర్ కామినేని బాలకృష్ణ , ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు స్వాతి , రాజగోపాల్ రెడ్డి మరియు సాయి యువసేన సర్వీస్ సభ్యులు హరీష్ , బాల ఉసేని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కూల్ స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల పై రాజకీయ వేధింపులు ఆపాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్కావెంజర్లను మధ్యాహ్న భోజన కార్మికులను తొలగించడం చాలా అన్యాయం అని తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి, బాల వెంకట్ సీఐటీయూ జిల్లా నాయకులు కే ,భాస్కర్ స్కూల్ స్కావెంజర్ల నాయకురాలు జయమ్మ, సరస్వతి తో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని నంద్యాల జిల్లా విద్యాధికారి డీఈవోకు సోమవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, భాస్కర్లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కార్మికుల కడుపు కొట్టే ప్రయత్నం మానుకోవాలని స్కూళ్లలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికులు స్కావెంజర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది కాబట్టి మా అన్వాయిలే స్కావెంజర్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు గా ఉండాలని రాజకీయ నాయకులు కార్మికులను బెదిరించడం మానుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అధికారులకు డీఈవో ఎంఈఓ లకు ఒక సర్క్యులర్ వెంటనే జారీ చేయాలని ఏ ఒక్క కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాలని అన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఎటువంటి జీతం పారితోషకము లేకుండా పనిచేస్తున్న కార్మికులను అధి కారం చేత రాజకీయ ప్రయోజనాల కోసం వారి జీవితాలతో చెలగాటమాడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి మంత్రులు తగు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే నంద్యాల జిల్లాలో చాలా మండలాల్లో బాగా పనిచేస్తున్న కార్మికులను తొలగిస్తున్నారని అన్నారు. ఈ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలనివారు డిమాండ్ చేశారు.

## రాగూర్ పురపాలక ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు స్కూల్ కిట్లను పంపిణి చేసిన ఎన్ఎండి ఫిరోజ్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
నంద్యాల స్థానిక నూనెపల్లె మంచినీళ్ల బావి దగ్గర ఉన్న రాగూర్ పురపాలక ప్రాథమిక పాఠశాల నందు విద్యార్థులకు స్కూల్ కిట్లను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. విద్య యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించి తెలుగుదేశం పార్టీ హయాంలో విద్యకు పెద్దపీట వేయడం జరిగిందని పిల్లలందరూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. గత ప్రభుత్వం నాడు నేడు అని గొప్పగా చెప్పుకుని చేసింది ఏమీ లేదని ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఎక్కడ ఉన్న పనులు అక్కడే ఉన్నాయని వాటిని పూర్తి చేయడంలో వైసిపి ప్రభుత్వం



విఫలమైందన్నారు . తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు విద్యకు పెద్దపీట వేస్తూ విద్యావ్యవస్థలను ప్రక్షాళన చేసి విద్యార్థులకు న్యాన్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారని అదేవిధంగా వారు ఉండేటువంటి స్కూల్ భవనాలను ఆధునీకరణ చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే



అక్కడ ఉన్న అధ్యాపకులు పాఠశాల సంబంధించిన సమస్యలను ఫిరోజ్ దృష్టికి తీసుకురావడంతో వాటిని సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి పిల్లలకు తన చేతులా మీదుగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎన్నికల్లో పనిచేసిన మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
మే13వ తేదీజరిగిన సార్వత్రిక ఎన్ని కల సందర్భంగా మునిసిపల్ అవుట్సో ర్సింగ్ ,వాటర్ వర్క్స్ కార్మికులందరూ ఎలక్షన్ అధికారులకు ,ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు మంచినీటి సరఫరా చేసినందుకు గాను ప్రత్యేక అలవెన్సు లు ఇవ్వా లని కోరుతూ జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, మున్సిపల్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య భాస్కరాచారి, ఉపాధ్యక్షులు ఆదాము, రామాంజనేయులు, సిద్దయ్య పాల్గొనడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆంధప్రదేశ్ రాష్ట్రంలో మే13వ తేదీ జరిగిన ఎన్ని కల సందర్భంగామునిసిపల్ అవుట్సో ర్సింగ్ కార్మికులతో ఎన్ని కల పని చేయించారు. ఎన్ని కలకు ముందు రోజుబస్సు లలో వచ్చి న బాక్సు లను దిగుమతి చేయడం,ఎన్ని కల కేంద్రాలకు చేర్చడం, ఎన్ని కలు పూర్తయిన తర్వా త వాటిని బస్సు లకు ఎక్కించడం అర్ధరాత్రి వరకు పని చేయించారు కానీ ఈసేవలకు గాను ఇతర అధికారులకు చెల్లించిన విదంగా ప్రత్యేక అలవెన్సు లు ఏమీ వీరికి చెల్లించలేదు కార్మికులు అందరిలోనూ తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. కనుక వెంటనే తమరు స్పందించి ఎన్ని కల కోసం విదులు నిర్వహించిన మున్ని పల్ అవుట్సో ర్సింగ్ కార్మికులు కూడా ప్రత్యేక అలవెన్సు లు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోగలరని కోరారు.

## గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారిని తొలగించాలి.

**-ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 24:
గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారులు తొలగించాలని ఏపీ గిరిజన ప్రజాసమ యొక్క రాష్ట్ర నాయకులు రాజు నాయక్ డిమాండ్ చేశారు.
సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్ లు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తో రాజునాయక్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ పై వెంటనే చర్యలు తీసుకొని విధుల నుంచి తొలగించాలని కోరారు. ఆ అధికారి ఇంతవరకు ఏ ఆశ్రమ పాఠశాలకు, హాస్టళ్లకు, కళాశాల వసతి గృహాలకు వెళ్లకుండా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. హాస్టల్లో కనీస వసతి మౌలిక సదుపాయాలు కల్పించడంలో విపలమయ్యారన్నారు. పర్యవేక్షణ లేకపోవడం వల్ల



అధికారి నిర్లక్ష్యానికి ఇప్పటికే కొన్ని స్కూళ్లు మూతపడ్డాయని కలెక్టర్ కు చెప్పారు. గిరిజన సంక్షేమ అభివృద్ధికి ప్రోత్సాహం చేయకుండా ధనార్జనే ధ్యేయంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ
విజయవాడలో డైరెక్టర్ ఐఏఎస్ ఆఫీసర్ మా బంధువు అంటూ ప్రతి హాస్టల్ వార్డెన్ల దగ్గర నుండి ప్రతినెల కొంత మొత్తాన్ని చెల్లించాల్సిందే నని హుకుం జారీ చేశారు. ఇలాంటి వ్యక్తి గిరిజనులకు అవసరం లేదు. మాకు మేలు చేసిన వారిని కొత్త రెగ్యులర్ అధికారిని నియమించి మా అభివృద్ధి తోడ్పడాలని అన్నారు. ఇలాంటి అవినీతి అధికారిని వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా గురుకుల రెసిడెన్షియల్ పి టి జి పాఠశాలలో చెంచు కమ్యూనిటీకి మాత్రమే అడ్మిషన్ల అవకాశం కల్పిస్తున్నారు. చెంచు కమిటీతోపాటు గురుకుల రెసిడెన్షియల్ పి టి జి లో సుగాలి, ఎరుకుల, యానాది కమ్యూనిటీకి చెందిన గిరిజన విద్యార్థులకు కూడా సీటు అవకాశం కల్పించేలా చూడాలని కోరుచున్నాము. నెరవాడ రెసిడెన్షియల్ పాఠశాలలో 600 మందికి స్టెంత్ అవకాశం ఉంటే 200 మంది మాత్రమే విద్యార్థినిలు ఉన్నారు. కావున గురుకుల రెసిడెన్షియల్ లో ప్రతి ఒక్కరికి సీటు కల్పించేలా చూడాలని కోరారు. ఎందుకంటే నిరు పేదరికంలో నివసిస్తున్న గిరిజనులకు గురుకుల రెసిడెన్షియల్ లో సీట్ అవకాశం కల్పించి గిరిజన నిరుపేద విద్యార్థినీలకు విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.